నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | సోమవారం 10 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నల్లాలు బిగించి.. నీటి వృథాను అరికట్టి

● 'నమస్తే' కథనానికి స్పందన

పైపునకు బిగించిన నల్లా

దండేపల్లి, జూన్ 9 : దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో పలుచోట్ల మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుండగా, శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'వృథాగా మిషన్ భగీరథ నీరు' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు. ఆదివారం భగీరథ నీరు వృథాగా పోతున్న చోట నల్లాలు బిగించారు. లీకేజీలు ఉన్న చోట మరమ్మతులు చేపట్టారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● బూరుగూడలో విగ్రహావిష్కరణ

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 9 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బూరుగూడ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లేశ్, మాజీ సర్పంచ్ గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆర్‌జీహెచ్‌వీ స్కూల్ వద్ద పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీపీ

ఆసిఫాబాద్ : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

గ్రూప్-1 ప్రశాంతం

● ఉదయం పది నుంచి ఒంటిగంట వరకు పరీక్ష ● మంచిర్యాల జిల్లాలో 7,443, ఆసిఫాబాద్ జిల్లాలో 2,258 మంది హాజరు

● కేంద్రాల వద్ద 144 సెక్షన్ ● ఆయాచోట్ల పరిశీలించిన కలెక్టర్లు, సీపీ, తదితర అధికారులు

పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్/మంచిర్యాల ఏసీసీ/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 9 : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకున్నారు. నిబంధనల మేరకు బూట్లు, మొబైల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించలేదు. 144 సెక్షన్ అమలు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, ప్రథమ చికిత్స కిట్‌లతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మంచిర్యాలలోని ప్రతిభ కళాశాల, మిమ్స్ ప్లేస్కూల్, ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,384 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 7,443 మంది హాజరైనట్లు తెలిపారు. మంచిర్యాలలోని ఆర్‌బీహెచ్‌వీ స్కూల్, ప్రభుత్వ బాలుర పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పరీక్ష అనంతరం ఎగ్జామ్స్ షీట్స్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే విషయమై పోలీస్ అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్, ఎస్ఐలు ఉన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, పీటీజీ గురుకుల పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాల, సెయింట్ క్లారిటీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2,783 మంది అభ్యర్థులకుగాను 2,258 మంది (81.13 శాతం) హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించామని తెలిపారు.

ప్రభుత్వ దవాఖానలో పస్తులు!

లక్షెట్టిపేట హాస్పిటల్‌లో అందని భోజనం

● మెనూ పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ ● తూతూ మంత్రంగా ఆహారమందించి చేతులు దులుపుకుంటున్న వైనం

● ఇబ్బందుల్లో రోగులు ● పట్టించుకోని అధికారులు

లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖాన


రోగులకు అందించే ఫుడ్ మెనూ

లక్షెట్టిపేట,జూన్ 9 : కేసీఆర్ సర్కారులో కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలతో మెరుగైన వైద్యమందించిన లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖాన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యమాని నిర్వహణ గాడితప్పి అధ్వానంగా మారింది. గత ప్రభుత్వం ప్రతి రోజూ ఉదయం పాలు, బ్రెడ్, టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంతో పాటు పండ్లు అందించింది. కానీ, ప్రస్తుతం పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వారం రోజులుగా రోగులకు సరిగా భోజనం అందక పస్తులుండాల్సి వస్తున్నది. మెనూ మాట పక్కన పెడితే.. ఒక్కోరోజు అసలు టిఫిన్, భోజనమే ఇవ్వడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ స్థానికంగా ఉండకపోవడం.. బిల్లులు రాకపోవడంతో తూతూ మంత్రంగా ఆహారం అందిస్తున్నట్లు చెబుతున్నారు. హాస్పిటల్ సిబ్బంది సరైన సమయానికి రోగులకు ఆహారం అందించేలా చూడాల్సింది పోయి సదరు కాంట్రాక్టర్‌తో చేతులు కలిపి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో నామమాత్రంగా ఆహారం పెడుతూ చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రతి రోగికీ రోజూ ఉదయం ఇడ్లి, ఉప్మా, కిచిడి, పొంగల్‌తో పాటు చట్నీ, సాంబార్, ఉడకబెట్టిన కోడిగుడ్డు, పాలు అందించాలి. మధ్యాహ్నం, రాత్రి అన్నంతో పాటు పుల్కాలు, కూరగాయల కర్రీ, ఆకుకూరతో చేసిన పప్పు, సాంబార్, పెరుగుతో పాటు ఉడకబెట్టిన గుడ్లు అందించాలి. కానీ.. కాంట్రాక్టర్ ఇవ్వేవీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం గ్యాస్ లేదంటూ .. మధ్యాహ్నం రోగులకు అన్నం కూడా ఇవ్వలేదని తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం రోగులకు కేవలం రవ్వతో చేసిన ఉప్మా ఇచ్చారని, పేషెంట్స్ ఎక్కువగా లేకపోవడంతో ఉప్మా మాత్రమే చేసినట్లు పలువురు తెలిపారు. మెనూ పాటించకుండా ఇష్టారీతిన భోజనం అందిస్తూ అందినకాడికి దండుకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు కోవాలని, ఇకపై మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

భోజనం పెట్టకపోతే ఎట్లా

నడుముకు దెబ్బతగిలితే నాలుగు రోజుల కింద వచ్చి చేరికైన. నాకు ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా కోడి గుడ్డుతో భోజనం పెట్టలేదు. పుల్కాలు కూడా ఇవ్వలేదు. నిన్న మధ్యాహ్నం గ్యాస్ లేదని భోజనం పెట్టలేదు. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వస్తుంటరు. గిట్లా భోజనం పెట్టకపోతే ఎట్లా.

- బత్తుల రాధ, పేషెంట్, లింగాపూర్

రవ్వ ఉప్మా పెట్టిన్రు

ప్రతి రోజూ రోగులకు భోజనం పెడుతరని నాకు తెల్వదు. ఏదో వాళ్లు ఇచ్చింది తింటున్నం. ఆదివారం పేషెంట్స్ తక్కువగా ఉన్నరని రవ్వతో చేసిన ఉప్మా పెట్టిన్రు. గదే తిని ఊరుకున్నం. పాలు ఇవ్వలేదు. శనివారం మధ్యాహ్నం అన్నం కూడా పెట్టడానికి ఎవరూ రాలే. పస్తులుండాల్సి వచ్చింది.

- ఆవుల దుర్గవ్వ, రోగి, కాసిపేట

లోహ గ్రామంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

లోహకు కరెంటచ్చింది

● ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

● 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన ● కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

● 'నమస్తే' కథనానికి స్పందన

దహెగాం, జూన్ 9 : దహెగాం మండలం ఖర్జీ గ్రామ పరిధిలోని లోహ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయి గిరిజనులు ఇబ్బందులు పడుతుండగా, ఈ నెల 9న 'నమస్తే తెలంగాణ' మెయిన్ పేజీలో 'అంధకారంలో లోహ' పేరిట కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు వెంటనే స్పందించారు. ఏఈ రవీందర్ సిబ్బందితో కలిసి ఆదివారం లోహ గ్రామానికి వెళ్లి పాడైపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 'నమస్తే'చొరవతో సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో బహుమతులు అందజేస్తున్న చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్

చెస్‌లో రాణించాలి

రెబ్బెన, జూన్ 9 : చెస్ క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రెబ్బెన మండలం గోలేటిటౌన్‌షిప్‌లో గల టీబీజీకేఎస్ కార్యాలయంలో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-9,11,13,15, ఓపెన్ టు ఆల్ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగాసన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్, చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కల్పన, జాయింట్ సెక్రటరీ రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సమ్మయ్య, తిరుపతి, శృతిక, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతలు వీరే..

మంచిర్యాలటౌన్, జూన్ 9 : స్థానిక గ్రీన్ సిటీలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విన్నర్స్, రన్నర్స్ వివరాలను జనరల్ సెక్రటరీ పుల్లూరి సుధాకర్ ఆదివారం వెల్లడించారు. విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులు జూన్, జూలై, ఆగస్టులో జరిగే అండర్-11, 13, 15, 17, 19 బాల బాలికలు, మెన్ అండ్ వుమెన్, మాస్టర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విన్నర్స్, రన్నర్స్‌కి మెడల్స్ అందజేయగా, ముఖ్యఅతిథిగా ఎస్‌టీపీపీ డీజీఎం పంతులు, పాత మంచిర్యాల కాంగ్రెస్ నాయకుడు బొలిశెట్టి కిషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు సత్యపాల్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, మధు, కృష్ణ, రాజలింగు, హర్ష, నరేందర్, రూబీ అకాడమీ బాధ్యుడు నరసింహ స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

అండర్-11 బాలురు సింగిల్స్‌లో విజేతగా శరవణన్, అండర్-13 బాలురు సింగిల్స్ విజేతగా మన్విత్, రన్నరప్‌గా శర్వానంద్, అండర్-15 బాలురు సింగిల్స్ విజేతగా మన్విత్, రన్నరప్‌గా ఈశ్వర్ ప్రసాద్, అండర్-15 బాలురు డబుల్స్ విజేతలుగా బన్నీ, షన్ను, రన్నర్స్‌గా ధనుష్, ఈశ్వర్‌ప్రసాద్, అండర్-17 బాలురు సింగిల్స్ విజేతలుగా ఆదిత్య, రన్నరప్‌గా రాము, అండర్-17 డబుల్స్‌లో విజేతలుగా ఆకర్ష్, లక్ష్మణ్, రన్నరప్‌లుగా రుతురాజ్, నెహిమయ్య, అండర్-19 బాలురు సింగిల్స్ విజేతగా ఆదిత్య, రన్నరప్‌గా రాము, డబుల్స్‌లో అఖిల్, సాత్విక్, మెన్స్‌సింగిల్స్‌లో విజేతగా రాజేశ్, రన్నరప్‌గా ఆదిత్య, మెన్స్ డబుల్స్‌లో విజేతగా భీమారావ్, సాయి, అండర్-11 బాలికల్లో హర్షిత, డబుల్స్‌లో హర్షిత, త్రిష, అండర్-13 సింగిల్స్‌లో సహస్ర, డబుల్స్‌లో ఆషు, ఆరాధ్య, అండర్-15 సింగిల్స్‌లో అనన్య, డబుల్స్‌లో అనన్య, ఆషు, అండర్-17 సింగిల్స్‌లో అనన్య, అండర్-19 సింగిల్స్‌లో శ్రీవల్లి, వుమెన్స్ సింగిల్స్‌లో శ్రీవల్లి విజేతలుగా నిలిచారు.

గెలుపొందిన క్రీడాకారులతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న సంఘం నాయకులు (ఇన్‌సెట్లో) కాలిపోయిన ఇల్లు

షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 9 : బాబాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి తర్వాత షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధమయ్యాయి. అందరూ గాఢ నిద్రలో ఉండగా, షార్ట్ సర్క్యూట్ కావడంతో కవాల్కర్ లక్ష్మి, సురేశ్ ఇళ్లలో మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బంగారం, నగదు పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఆర్ఐ సాయిప్రసాద్ నిర్వహించిన పంచనామా ప్రకారం లక్ష్మికి చెందిన 4 తులాల బంగారం, రూ. 4.20 లక్షలు, 5 క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర సరుకులు కాలిపోగా, సురేశ్‌కు చెందిన 70 బస్తాల యూరియా, 40 బస్తాల డీఏపీ, రూ. 42 వేలు, వరి గడ్డి పూర్తిగా కాలిపోయాయి.

అఖిల గాండ్ల తెలికుల సంఘం సాయం

బాబాపూర్ గ్రామానికి చెందిన కవాల్కర్ లక్ష్మి ఇల్లు దగ్ధం కావడంతో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు విరాళాల ద్వారా సేకరించిన రూ. 10,768తో పాటు 50 కేజీల బియ్యం, 5 లీటర్ల వంట నూనె, సామగ్రి, వంట పాత్రలు అందించి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం యువజన అధ్యక్షుడు హివ్రే సందీప్, సెండే మురళీకృష్ణ, ఆనంద్‌రావు, ఉద్ధవ్, తపసే పోచన్న, మేంగ్రే మారుతి, కవల్కార్ రవీందర్, ఆకాశ్, బిజ్జు ఉన్నారు.

లైవ్‌డ్రాయింగ్ కళాకారుడు

పోచన్నకు ఘన స్వాగతం

మంచిర్యాలకు చేరుకున్న పోచన్నను సన్మానిస్తున్న స్థానికులు

మంచిర్యాలటౌన్, జూన్ 9 : లైవ్ డ్రాయింగ్ పేరిట దేశాన్ని చుట్టేసి వచ్చిన చెన్నూరు పట్టణానికి చెందిన కళాకారుడు ఏల్పుల పోచన్నకు ఆదివారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. 2017 డిసెంబర్‌లో కశ్మీర్ నుంచి కన్యాకుమారి యాత్ర ప్రారంభించిన ఆయన ఈ నెల 7న ముగించాడు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు రాగానే ఆయనకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది మన్ననలు పొంది తెలంగాణకే గొప్ప ఖ్యాతిని తీసుకువచ్చాడంటూ పోచం గురువు మద్దూరి రాజన్న అన్నారు. నడుస్తూ, సైకిల్, బైక్, రైళ్లలో 30,700 కిలోమీటర్లు ప్రయాణించారని తెలిపారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు కోరల్ల రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పూదరి ప్రభాకర్, తిరుపతి, బద్రి శ్రీనివాస్, వర్మణి వెంకటేశ్వర్లు, గంగాధరి రాజు, మల్లేశ్, తోట సదానందం, రాజు, కుర్మా రాజేశ్వర్ గౌడ్, బోయిని మోహన్ యాదవ్, సుందిళ్ల రమేశ్, కమలాకర్, సమ్మయ్య, రాంబాబు, డోలక్ సమ్మయ్య, సాగర్, కిరణ్, పవన్ ఉన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679